క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ లైన్లు, తదితర మరమ్మతుల కారణంగా ఆదివారం పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, సాజీద్‌పుర పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) పండరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



కైలాసపతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మానాల కైలాసపతిని శనివారం గ్రామ సర్పంచ్ రాజబోయిన స్వర్ణలత, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన కైలాసపతి ఏడేళ్ల క్రితం బీఎస్ఎఫ్‌లో చేరి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం తన స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు అభినందించారు. దేశ భద్రత కోసం పని చేస్తున్న కైలాసపతి సేవలను కొనియాడారు.

దళితుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్లు తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దళితుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని కౌన్సిలర్లు సాకి ఆనంద్, గ్యాదరి రవీందర్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి మంత్రి హరీశ్‌రావు కోటి రూపాయల నిధులు మంజూరు చేసినందుకు గాను కౌన్సిలర్ల ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ భవన్‌లో సీఎంకేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం హర్షనీయమన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో దళితులు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గ్యాదరి రామస్వామి, మాల సదర్ సంఘం అధ్యక్షులు తండ భూమయ్య, గ్యాదరి మహంకాళి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, గ్యాదరి భూమలింగం, జక్కుల రాజు, గ్యాదరి కనకమల్లయ్య, వెంకట్, మల్లేశం, బాలకిషన్, సురేందర్, శ్రీనివాస్, శ్రీహరి, పరశురాములు, చైతూ, సందీప్, యాదగిరి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): యాసంగిలో రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి సీజన్ త్వరలోనే ప్రారంభం కానుందని, సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. వానాకాలం సీజన్‌లో సంఘం ఆధ్వర్యంలో స్వల్పకాల, దీర్ఘకాల రుణాలు 3 కోట్ల 40 లక్షలు అందించామని తెలిపారు. సమావేశంలో సీఈఓ రాములు, డైరెక్టర్లు సంజీవులు, వెంటకయ్య, వెంకట్‌నర్సు, పుష్పలత, భాగ్యలక్ష్మి, సిబ్బంది సత్యనారాయణరెడ్డి, సందీప్‌రెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య



కొమురయ్య శిలాఫలకం వద్ద నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శనివారం పట్టణ కేంద్రంలో దొడ్డి కొమురయ్య సేవా సమితి చైర్మన్ దొడ్డి నరహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంగడిబజార్ వద్ద గల దొడ్డి కొమరయ్య శిలాఫలకానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరహరి మాట్లాడుతూ.. ప్రతియేటా ఏప్రిల్ 15న తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం, పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతుబజార్

- రోడ్డు పక్కనే విక్రయాలు
- వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు



నిరుపయోగంగా చిన్నకోడూరు రైతుబజార్

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు పండించిన కూరగాయలు దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా అమ్ముకునే విధంగా లక్షలు వెచ్చించి రైతు బజార్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అది నిరుపయోగంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, మాంసం విక్రయాలు జరుపుతున్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో 2018లో రూ.30లక్షలు వెచ్చించి రైతుబజార్ నిర్మించారు. మార్కెట్ కార్యాలయం, నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు 18 దుకాణాలు ఏర్పాటు చేయగా కూరగాయలు, మాంస విక్రయాలకు వాటిని కేటాయించారు. ఏడాది పాటు విక్రయాలు కొనసాగాయి. మార్కెట్‌లో మురుగు కాల్వ నిర్మించకపోవడంతో విక్రయదారులకు సమస్యగా మారింది. దీంతో విక్రయదారులు రోడ్లకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో రైతు బజారులో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్త చెదారంతో నిండిపోయింది. మందుబాబులకు, అ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు



స్వామివారికి పూజలు చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె వేంకటేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణ మహోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వామివారి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలు వేరువేరుగా మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయ సప్తదశ(17వ) వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రధానార్చకుడు శేషం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



షాదీఖానాను పరిశీలిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని షాదీఖానా వద్ద రూ.10 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమ ప్రాధాన్యత నిస్తున్నాడన్నారు. దుబ్బాకలో షాదీఖానాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, రొట్టె రాజమౌళి, మైనార్టీ నాయకులు షాదుల్, హాజీబాబ, హుస్సైన్ తదితరులు ఉన్నారు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో యాదవ సంఘం భవన నిర్మాణానికి శనివారం ఎంపీ ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యానారాయణ, సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, ఉపసర్పంచ్ మానసరంజిత్, మిరుదొడ్డి సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్‌లకు నిలయాలుగా గ్రామాలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు నేడు సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలవడంతో పాటు సినిమా షూటింగ్‌లకు నిలయాలుగా మారుతున్నాయని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారం గ్రామంలో హర్రర్ కథాంశంతో తెరకెక్కుతున్న షూటింగ్‌ను శనివారం ఆ గ్రామసర్పంచ్ బాల్‌చంద్రం, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గ్రామీణ ప్రాంతంలో తెరకెక్కిన బలగం సినిమా ఘన విజయాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. అక్కారంలో నిర్మితమవుతున్న ఈ చిత్రం సైతం విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు రమేశ్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, సంతోష్‌గుప్తా, చిత్ర నిర్మాత కిరణ్, దర్శకుడు గిరి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..

శ్రవణ నక్షత్ర మహోత్సవం



పూజలు చేస్తున్న వేదపండితులు

వర్గల్(గజ్వేల్): శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలతో వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రం అలరారింది. శనివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో వేంకటేశ్వరాలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి విశేష పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పూలమాలికలు, ఆభరణాలతో అలంకరించారు. వేదపండితులు, వేద విద్యార్థుల బృందం విష్ణు సహస్రనామాలు, లక్ష అక్షితార్చనలతో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. గోవింద నామంతో ప్రాంగణం మార్మోగింది. వేడుకల్లో భక్తులు పాల్గొని తరించారు.

బీఆర్ఎస్ సభ్యత్వానికి చిట్టాపూర్ సర్పంచ్ రాజీనామా

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ పోతనక రాజయ్య బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన మాట్లాడుతున్న వీడియోను వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. రాజయ్యను వివరణ కోరగా కొన్ని అనివార్య కారణాలతో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు. తన ఆత్మీయులు, అనుచరులు, స్నేహితులతో సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానన్నారు. రాజీనామా చేయడంపై సర్పంచ్ రాజయ్యతో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి బుజ్జగించినట్లు సమాచారం.

స్థల దాతకు అభినందన



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మల్లికార్జున్

బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి 30 గుంటల వ్యవసాయ భూమిని ఇచ్చినందుకు గాను బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన ఐలేని శ్రీనివాస్‌రెడ్డిని శనివారం మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పోచయ్య, వడ్లూరు ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాంకాలి ప్రవీణ్, డీవీ రావు, రాజు, రమేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుప్రియ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. 6వ తరగతి ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లు http://telanganams.cgg.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి



హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని ఫైర్ సిబ్బంది శనివారం బస్టాండ్‌లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వాటిని ఏ విధంగా ఎదుర్కొంటారో విన్యాస రూపకంగా చేసి చూపించారు. అగ్నిమాపక కేంద్రం పరిధిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 101 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా హుస్నాబాద్ అగ్నిమాపక కేంద్రం సెల్ నంబర్ 8712699256కు తెలియజేయాలని ఫైర్ సిబ్బంది కోరారు. సకాలంలో చేరుకొని ఆస్తి, ప్రాణ నష్టాన్ని వీలైనంత వరకు కాపాడుతామని తెలిపారు. కార్యక్రమంలో బస్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్, ఫైర్ అవుట్ పోస్ట్ ఇన్‌చార్జ్ నరేశ్, ఫైర్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

సాదాసీదాగా చేర్యాల మున్సిపల్ సమావేశం

పలు అంశాలపై ఆమోదం తెలిపిన పాలకవర్గం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ద్వారా రూపొందించిన అసెస్మెంట్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ రూల్స్ 2020 ప్రకారం కనీస రేట్ ఆఫ్ టాక్స్‌ను ప్రతిపాదించారు. అలాగే పట్టణ పరిధిలో మంచి నీటి సరఫరా విషయంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు, కుడిచెరువు సమీపంలో చిల్డ్రన్ పార్కు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. పట్టణ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదా ఖతూన్, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేశ్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీశ్, కో–ఆప్షన్ సభ్యురాలు అంజనీదేవి, మేనేజర్ ప్రభాకర్, టీపీఓ కల్యాణ్‌చక్రవర్తి, ఏఈ శ్రీకాంత్, జేఓ రాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వంటావార్పును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ ఈ నెల 21న జేఏసీ, అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టనున్న వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 12 వార్డుల్లో కమిటీలను నియమించినట్లు జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ తెలిపారు. శనివారం వాసవి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కమిటీల్లో వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాల బాధ్యులను భాగస్వాములుగా చేసినట్లు తెలిపారు. వంటావార్పు కార్యక్రమంలో ప్రజలు, వర్తక, వాణిజ్య వర్గాలు, కార్మిక, కర్షకులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు మల్లారెడ్డి, ఆగంరెడ్డి, శ్రీనివాస్, బీరయ్య, కళావతి, యాదగిరి, భిక్షపతి, చిరంజీవులు, వెంకట్‌మావో, ప్రసాద్, సుదర్శన్, రాజు, అరుణ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

దుబ్బాక: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని దౌల్తాబాద్, రాయపోల్ మండలాల కార్యదర్శులు శనివారం ఆయా ఎంపీడీఓలకు శనివారం వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రతి సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని కోరారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చాలన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఈ నెల 28 నుంచి జరిగే సమ్మె నోటీస్‌ను ఎంపీడీఓకు శనివారం కార్యదర్శులు అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ.. కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నోటీసును ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మంజులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కిరణ్, లోకేశ్‌రెడ్డి, మురళి, బాల్‌రాజు, సతీష్, అనూష, పంచాక్షరీ, వీణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

దుబ్బాక: సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని దౌల్తాబాద్ మండలం గాజులపల్లి సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. గాజులపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.36వేలు, అదేవిధంగా పోతుగంటి భాగిరెడ్డికి రూ.18వేల చెక్కులను శనివారం అందించారు.

కనుల పండువగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పారిపల్లి వీధిలో గల శ్రీ రమావెంకట సత్యనారాయణ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవల్లో భాగంగా శనివారం సత్యనారాయణస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛారణలతో కల్యాణం జరిపించారు. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని పూలతో సుందరంగా అలంకరించారు. కల్యాణ మహోత్సవం ముగిసిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాలు, స్వామివారి ఊరేగింపు ఉంటుందని, 17న పూర్ణాహుతి కార్యక్రమంతో వార్షికోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

నిర్వహణ.. నిర్లక్ష్యం



కింద పడిపోయిన తాత్కాలిక టాయిలెట్ బాక్స్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొందరు ఉద్యోగుల పని నిర్మాణం మాది నిర్వహణ మీది అన్న చందంగా తయరైంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. అయినాపూర్ నుంచి కొమురవెల్లి వచ్చే మెయిన్ రోడ్డులో గల టీ.టీ.డీ ప్రహరీ పక్కన 3 తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేశారు. అందులో ఒక టాయిలెట్ కింద పడిపోగా, మరొకటి ముందుకు వంగింది. ఉన్న దాంట్లో నీరు రాకపోవంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ అధికారులు స్పందించి వెంటనే టాయిలెట్స్‌ను బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ముగిసిన పాలిటెక్నిక్ శిక్షణ రిజిస్ట్రేషన్ గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ రిజిస్ట్రేషన్ గడువు ముగిసిందని శిక్షణ తరగతుల కన్వీనర్ సంజయ్ అన్నారు. శనివారం ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ.. నేటి నుంచి ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఆదివారం నుంచి తరగతులకు హాజరవ్వాలన్నారు.

◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

హుస్నాబాద్: పట్టణానికి చెందిన మోతె రాహుల్ ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతి చెందగా హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా చన్నీళ్ల వెంకన్నకు ఇటీవల బైపాస్ సర్జరీ కాగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, అక్కన్నపేట అధ్యక్షుడు వీరాచారి, నాయకులు సతీశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

◆ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆహారం

గజ్వేల్‌రూరల్: పౌష్టికాహారం ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య, అదనపు సివిల్ కోర్టు జడ్జి ప్రియాంకలు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నపుడే ఆరోగ్యవంతులుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సీఐ వీరప్రసాద్, కౌన్సిలర్లు, బార్ అసోసియేషన్ సభ్యులు హోమియోపతి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ హనుమాన్ ఆలయ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌లోని హనుమాన్ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ పత్రికను శనివారం ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు మాధవశర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ ఆలయాన్ని పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, ఆలయ ట్రస్టు చైర్మన్ మహేశ్, నాయకులు సతీశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్‌శర్మ, సాయిరెడ్డి, అజయ్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చారిత్రాత్మక ఘట్టం

కోహెడ(హుస్నాబాద్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణ చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర దళిత నేత, న్యాయవాది జేరిపాతుల కిరణకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుతో మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన సచివాలయానికి అంబేడ్కర్ పేరు నామకరణ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తలారి నర్సయ్య, మంద మల్లేశం, శంకర్, జాతీయ బీసీ సంఘం నాయకుడు రాజు, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ బంజేరుపల్లి బీఆర్ఎస్ బూత్ కమిటీల ఎన్నిక

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్.బంజేరుపల్లి గ్రామ బీఆర్ఎస్ బూత్ కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్వాల గణేశ్, ఉపాధ్యక్షుడిగా మంతూరు ప్రశాంత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా స్వామి, బూత్ కమిటీ సభ్యులుగా బాల్‌రాజు, అశోక్, శ్రీకాంత్, నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

◆ రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రోడ్లపై ఎవరైనా ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై తాండ్ర వివేక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాల్లోని తారురోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారని, తద్వారా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి రైతులు తమ కల్లాలో మాత్రమే ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు. గతంలో రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నామని గుర్తు చేశారు. పోలీసు వారి విన్నపాన్ని ప్రతి రైతు పాటించాలని సూచించారు.

◆ ఉత్సవాలకు ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే చౌడలమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఎంపీని కలిసిన వారిలో ఉపసర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు దోమకొండ నర్సింహులు, బొల్లు స్వామి తదితరులు ఉన్నారు.

◆ మాజీ సర్పంచ్ మృతిపై సంతాపం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని చిట్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ పెద్ద పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం జరిగిన అంత్యక్రియల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.